సాక్షి

పార్వతీపురం మన్యం

శుక్రవారం, 20, జూన్, 2025



జోగిందొరవలసకు ఝలక్..!

పేదల చదువు విషయంలో విద్యార్థులతో ప్రభుత్వం ఆటలాడుతోంది. సంస్కరణల పేరుతో ఆందోళనకు గురిచేస్తోంది. - IIలో



కాలేజీలో సీట్లు హౌస్‌ఫుల్..!

రాజాం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అన్ని గ్రూపుల్లోనూ సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. మెరుగైన విద్యాబోధనే దీనికి కారణం. - IIలో



కూటమి కక్షపూరిత చర్యలు

ఇటీవలే కౌన్సిలర్లకు తాయిలాలతో వల వేసి అధికారాన్ని చేజిక్కించుకున్న టీడీపీ నాయకులు వైస్‌చైర్మన్ పదవికి కూడా అవిశ్వాసం పెట్టిన సంగతి తెలిసిందే. - IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పాలిసెట్‌లో పాల్గొనేందుకు ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్‌లో 1 నుంచి చివరి ర్యాంక్ వరకు అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 27వ తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.250గా పేర్కొన్నారు. ర్యాంకుల వారీగా ధ్రువపత్రాల పరిశీలన ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి విజయనగరం పూల్‌బాగ్‌లోని ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రారంభమవుతుందన్నారు. వివరాల కోసం 'పాలిసెట్.ఏపీ.జీఓవీ.ఐఎన్.' వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

రేగులగూడ పరిసరాల్లో గజరాజులు




రేగులగూడ పరిసరాల్లో సంచరిస్తున్న నాలుగు ఏనుగులు

సీతంపేట: సీతంపేట–కొత్తూరు ప్రధాన రోడ్డును దాటి వెంపలగూడ, రేగులగూడ పరిసరాల్లో ఏనుగులు గురువారం సంచరించాయి. అక్కడి జీడితోటల్లో ఘీంకారాలు చేయడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొండపోడు పనులు, ఖరీఫ్ సీజన్ కావడంతో దుక్కిలు చేయడానికి పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. ఎఫ్‌బీఓ దాలినాయుడుతో పాటు ట్రాకర్లు ఏనుగుల సంచారాన్ని గమనిస్తున్నారు. ఏనుగులు సంచరించే వైపు ఎవ్వరినీ వెళ్లనీయకుండా నియంత్రిస్తున్నారు.

దుర్గాదేవిని దర్శించిన ఢిల్లీ హైకోర్టు జడ్జి

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారిని ఢిల్లీ హైకోర్టు జడ్జి గేదెల తుషార్‌రావు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉమామహేశ్వరరావు, చిన్నిలు ఆయనకు వేదాశీస్సులు అందజేశారు. అమ్మవారి దర్శనభాగ్యం ఎంతో ఆనందాన్నిచ్చిందని, ఎప్పుడు ఈ ప్రాంతానికి వచ్చినా రుషింగి దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటానని ఆయన వెల్లడించారు.



తల్లికి వందనం లబ్ధిదారులకు విద్యుత్ షాక్..!

- 300 యూనిట్లు వినియోగం లేకున్నా.. ఉన్నట్లు రిమార్కు
- పరిశీలించకుండానే పంపించేస్తున్న సచివాలయ సిబ్బంది
- విద్యుత్ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్న తల్లిదండ్రులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

తల్లికి వందనం పథకంలో కొర్రీలు తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జాబితాలో తప్పులు కూడా చాలా మందిని అనర్హులుగా మిగిల్చాయి. భూమి లేకున్నా అధిక శాతం మందికి ఉన్నట్లు, విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటినట్లు సచివాలయాల వద్ద జాబితాల్లో చూపుతోంది. జిల్లాలో 1,08,951 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద లబ్ధి కలిగిన విషయం విదితమే. వీరికి రూ.13 వేలు చొప్పున నిధులు జమయ్యాయి. ఇంట్లో చదువుకున్న పిల్లలందరికీ పథకం వర్తింపజేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఈ లెక్కన మరింత మందికి లబ్ధి కలిగే అవకాశం ఉంది. ఇంకా వేలాది మంది ఉంటారని అంచనా. వారంతా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

విద్యుత్ బిల్లులు ఎక్కువ చూపడంతో..

జాబితాలో తప్పుల వల్ల అధిక శాతం మంది అర్హత కోల్పోయారు. ప్రధానంగా నెలకు వంద యూనిట్లు వినియోగిస్తున్న వారికి కూడా 300 యూనిట్లు వినియోగిస్తున్నట్లు రిమార్కుల్లో చూపుతున్నారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడి సిబ్బంది కనీసం పరిశీలించకుండానే విద్యుత్ కార్యాలయం వద్దకు వెళ్లాలని చెప్పి పంపించేస్తున్నారు. అక్కడ నుంచి ఏడాది వినియోగపు ధ్రువపత్రం తీసుకురావాలని చెబుతున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాలయాల్లో ఈఆర్‌వోలు, ఏఈవోలు, ఏఈలు వీటిని జారీ చేస్తారు. 300 యూనిట్లు ఎవరికీ వాడకం లేకున్నా.. సచివాలయ సిబ్బంది అందరితోనూ తెప్పిస్తుండటం వల్ల ప్రతిరోజూ విద్యుత్ సంస్థ కార్యాలయం వద్ద తల్లిదండ్రులు బారులు తీరుతున్నారు. వందలాది మందికి ఒకేసారి సర్టిఫికెట్లు ఇవ్వాల్సి రావడంతో అక్కడి సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో కొంతమంది విద్యుత్ శాఖ సిబ్బంది తప్పిదాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. 300 యూనిట్లు దాటి వినియోగిస్తున్న వారికి కూడా తక్కువగా 'సర్దుబాటు' చేసి, సర్టిఫికెట్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలు సడలించి, అందరికీ వందనం వర్తింపజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



1998నా.. 2008కా!

- బదిలీల్లో ప్రాధాన్యం ఎవరికి?
- తమ వృద్ధాప్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటున్న ఎంటీఎస్‌లు



సాక్షి, పార్వతీపురం మన్యం: ఉపాధ్యాయుల బదిలీలు ముగిశాయి. ఇక మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోస్టింగులిచ్చిన విషయం తెలిసిందే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 480 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. 1998 బ్యాచ్‌కు చెందిన వారిలో విధుల్లో చేరిన కొద్దిరోజులకే కొంతమంది ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పుడు పని చేస్తున్న వారిలో కొందరు ఒకట్రెండు సంవత్సరాల్లో రిటైర్‌మెంట్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం జరగనున్న బదిలీల్లో తమను దూర ప్రాంతాలకు పంపిస్తే ఎలా చేయగలమని వారంతా వాపోతున్నారు. ప్రభుత్వం కూడా బదిలీల్లో 2008 డీఎస్సీ వారికి తొలి ప్రాధాన్యమివ్వాలని భావిస్తోంది. అదే జరిగితే తాము అన్యాయమైపోతామని 1998 ఎంటీఎస్‌లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ప్రకటించారు. మిగిలి ఉన్న సర్వీసును పరిగణనలోకి తీసుకుని మానవతాదృక్పథంతో స్థాన చలనానికి అవకాశం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

'యోగాంధ్ర' ట్రయల్ రన్ విజయవంతం

- మారికవలస మీదుగా తిమ్మాపురం బీచ్‌కు బస్సురూట్
- జిల్లాకు 30 కంపార్ట్‌మెంట్‌లు
- 4 చోట్ల పార్కింగ్ స్థలాల కేటాయింపు
- పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన కలెక్టర్, ఎస్పీ



ఆర్టీసీ బస్సులో జిల్లా అధికారులతో ప్రయాణించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం అర్బన్:

విశాఖలో ఈ నెల 21న నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం కోసం జిల్లా నుంచి శుక్రవారం చేపట్టిన ట్రయల్‌రన్ విజయవంతంగా జరిగింది. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి 16 బస్సులలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, లైజన్ అధికారులు ప్రయాణించారు. రహదారి మధ్యలో ఎస్పీ వకుల్‌జిందల్, వేదికల ఇన్‌చార్జి రోణంకి కూర్మనాథ్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జేసీ సేతుమాధవన్, అదనపు ఎస్పీ సౌమ్యలత, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ తదితరులు బస్సులో ఎక్కి కలెక్టర్‌తో పాటు వేదిక వరకు పల్లెవెలుగు బస్సులో ప్రయాణం చేశారు. బస్సులన్నీ జాతీయ రహదారి గుండా ప్రయాణించి మారికవలస నుంచి తిమ్మాపురం బీచ్ వద్దకు చేరుకొని బస్సుల రూట్లను, దిగే స్థలాలను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జిల్లా నుంచి వెళ్లే 660 బస్సుల కోసం తొట్లకొండ, ఏపీఐఐసీ హిల్స్, బావి కొండలు, ఐటీ హిల్స్ వద్ద 4 చోట్ల పార్కింగ్ కోసం కేటాయించారు. జిల్లాకు 30 కంపార్ట్‌మెంట్‌లను కేటాయించారు. సుమారు వెయ్యి మందికి ఒక కంపార్ట్‌మెంట్ చొప్పున కేటాయించి, ప్రతి కంపార్ట్‌మెంట్‌కు నంబర్‌ను రాయడం వల్ల అది ఏ రూట్‌లో ఉందో తెలియజేయడానికి పోలీస్ అధికారులను నియమించారు. లైజన్ అధికారులు వారికి కేటాయించిన బ్లాక్‌ల వద్దకు వెళ్లి పరిశీలించారు.

యోగాంధ్రకు సమాయత్తం కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సమాయత్తం కావాలని మండల ప్రత్యేక అధికారులు, జిల్లా, మండల అధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్ర, స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర, డీఏ జుగా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నారని, అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 3,150 వేదికల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 5.42 లక్షల మంది యోగాంధ్రకు రిజిస్టర్ చేసుకున్నారని, వీరంతా ఆ రోజు పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీవేదిక వద్ద బ్యాక్ డ్రాప్ బ్యానర్, సౌండ్ సిస్టం, ప్రత్యక్ష ప్రసారం, గ్రీన్ మ్యాట్ ఇతరత్రా ఏర్పాట్లు ఉండాలని, ఆ రోజు ఉదయం 6 గంటలకే అందరూ సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. యోగా చేసే సమయంలో క్వాలిటీతో కూడిన ఫొటోలు, వీడియోలు తీయించాలని, ప్రజాస్పందన కూడా తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. 21న జరగనున్న యోగాంధ్రలో ప్రజలతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, డాక్టర్ టి.జగన్మోహనరావు, డ్వామా పథక సంచాలకులు కె.రామచంద్రరావు, డీపీఓ టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీడీ ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'తోటపల్లి'పై కూటమి కినుక

- సాగునీటి కాలువలను బాగు చేయలేదు
- దీనిపై రైతుల పక్షాన పోరాటం చేస్తాం
- నేటి సాయంత్రం కాలువల పరిశీలన కార్యక్రమం
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి

పాలకొండ: తోటపల్లి కాలువలను ఆధునీకరించి రైతులకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. పాలకొండలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీటి కాలువల అభివృద్ధిపై ప్రభుత్వం కినుక వహించడాన్ని తప్పుబట్టారు. శిథిలావస్థకు చేరిన నాగావళి కుడి, ఎడమ కాలువల షట్టర్లు బాగుచేయాలని డిమాండ్ చేశారు. షట్టర్లు పాడవ్వడంతో రిజర్వాయర్‌లోని నీరు సాగునీటి కాలువల్లోకి పెద్దస్థాయిలో చేరి గండ్లు పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే నీరు వృథాగా సరఫరా అవుతూ పంటపొలాల్లో చేరి వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. 2023–24 సంవత్సరంలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త షట్టర్ల ఏర్పాటుకు రూ.20 లక్షలు మంజూరు చేసిందని, టెండర్ల దశలో ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు. ఎడమ కాలువ ప్రధాన లింక్ కెనాల్ రక్షణ గోడకు సాంకేతిక అనుమతులు తీసుకువచ్చామన్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఈ పనులు బుట్టదాఖలయ్యాయన్నారు. కాలువల ఆధునికీకరణ పనులను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కాలువల షట్టర్లు బాగుచేయాలని, కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలోని బృందం కాలువల పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతుందని వివరించారు. రైతులందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- ఉమ్మడి విజయనగరం జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి



విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల గురుకుల సమన్వయకర్త ఎస్.రూపావతి గురువారం తెలిపారు. విజయనగరం జిల్లా పరిధిలోని 8, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని 5 పాఠశాలల్లో గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 25న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి తరగతికి సంబంధించిన ప్రశ్నపత్రం ముందు తరగతి గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్ట్స్ సిలబస్ ఆధారంగా రూపొందించి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 89858 83015, 63038 38657 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మిగులు సీట్ల ఖాళీల వివరాలు తరగతుల వారీగా..

తరగతి	విజయనగరం జిల్లా	మన్యం జిల్లా	మొత్తం
6వ తరగతి	263	172	435
7వ తరగతి	97	98	195
8వ తరగతి	61	67	128
9వ తరగతి	76	62	138
మొత్తం	497	399	896

22 నుంచి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మిగులు సీట్ల ప్రవేశాల కోసం ఈ నెల 22 నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రూపావతి చెప్పారు. బాలికలకు ఈ నెల 22న చీపురుపల్లి బాలికల గురుకుల పాఠశాలలోను, బాలురకు ఈ నెల 23న కొప్పెర్ల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ మిగులు సీట్లకు బాలికలకు ఈ నెల 26న నెల్లిమర్ల గురుకుల పాఠశాలలోను, బాలురకు 27న కొప్పెర్ల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

రైతన్నపై విత్తు భారం.. రూ. 99.01 లక్షలు!



- విజయనగరం జిల్లాలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం రూ.91 వేల హెక్టార్లు
- బస్తాకు రూ.30 నుంచి రూ.126 పెరుగుదల

వరి విత్తనాల ధరలు:

విత్తన రకం	గతేడాది	ఈ ఏడాది	పెరిగిన ధర
సాంబమసూరి (25 కేజీలు)	రూ.795	రూ.825	రూ.30
ఎంటీయూ-1224(25కేజీలు)	రూ.795	రూ.800	రూ.05
ఆర్‌జీఎల్-2537(30 కేజీలు)	రూ.954	రూ.990	రూ.36
బీపీటీ-3291	రూ.834	రూ.960	రూ.126
ఎంటీయూ-1121	రూ.894	రూ.960	రూ.66
ఎంటీయూ-1318	రూ.894	రూ.960	రూ.66
ఎన్ఎల్ఆర్-3449	రూ.915	రూ.960	రూ.45

వరి విత్తన కేటాయింపు ఇలా...

విత్తన రకం	కేటాయించిన విత్తనాలు క్వింటాళ్లలో
ఎంటీయూ-1121	38,000
ఎంటీయూ-1224	16,50
బీపీటీ-3291	2,500
బీపీటీ-5204	2,500
ఎంటీయూ-7029	2,000
ఎంటీయూ-1318	800
ఎంటీయూ-1064	2,200
ఆర్‌జీఎల్-2537	200
ఎంటీయూ-1061	60
ఆర్ఎన్ఆర్-15048	50
ఎన్ఎల్ఆర్-3449	50

విజయనగరం ఫోర్ట్:

'ఎద్దు పుండు మీద కారం చల్లిన' చందంగా తయారైంది రైతులపై కూటమి ప్రభుత్వం తీరు. పంటలకు గిట్టుబాటు ధర లేక.. పంటను కొనుగోలు చేసేవారు లేక రైతులు కాడి విడిచి పెట్టాల్సిన పరిస్థితి నెలకుంది. వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా ఓ వ్యాపకంగా చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతన్నలను అన్ని విధలా ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఎన్నికల వేళ ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇప్పటివరకు అమలుచేయలేదు. కౌలు రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ సాగుపెట్టుబడికి డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ స్థితిలో రైతులకు రాయితీపై అందించే వరి విత్తన ధరలు పెరగడంపై ఆందోళన చెందుతున్నారు. ఆ భారాన్ని ఎలా భరించాలంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.



వరి విత్తన బస్తాలు

- **ఇదీ లెక్క..**

జిల్లాలో వరి పంట సాగు సాధారణ విస్తీర్ణం 91 వేల హెక్టార్లు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు 50,010 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు కేటాయించారు. ఇప్పటి వరకు 35,335 క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో నిల్వ చేశారు. వరి విత్తనాల ధరలు గతేడాది కంటే ఈ ఏడాది బస్తాకు రూ.30 నుంచి రూ.126ల వరకు పెరిగాయి. దీనివల్ల జిల్లా రైతులపై రూ.99.01 లక్షల భారం పడనుంది. రైతు సంక్షేమానికి పాటు పడతామని గొప్పలు చెప్పిన కూటమి సర్కారు విత్తన ధరలు పెరిగినప్పటికీ వాటిని తగ్గించే ఆలోచన చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది ధర పెరిగింది

నాకు రెండు ఎకరాలు పొలం ఉంది. గతేడాది ఎంటీయూ–1121 రకం వరి పంట వేశాను. విత్తన బస్తా రూ.894లకు కొనుగోలు చేశాను. ఈ ఏడాది అవే విత్తనాలను రూ.960కు కొనుగోలు చేశాను. గతేడాది కంటే ఈ ఏడాది రూ.66లకు ఎక్కువ చెల్లించాను.

– రంధి నాగేశ్వరరావు, రైతు, పెదమేమలి

యోగా డే



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ సూర్యనారాయణ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'యోగా డే' ఆకృతిలో కూర్చొని యోగా ప్రాధాన్యంను తెలియజేశారు.

– సంతకవిటి

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి

• పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించినట్టు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. దీనికోసం గ్రామ స్థాయిలో ఉన్న ఇబ్బందులను తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు వచ్చినట్టు తెలిపారు. విజయనగరం మెసానిక్ టెంపుల్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ బలోపేతంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసినది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనన్నారు. కూటమి ప్రభుత్వం రాజధానిపై పోరాటం చేస్తే హౌస్ అరెస్టు చేశారని, స్టీల్ ప్లాంట్ కోసం దీక్ష చేస్తే దీక్ష భగ్నం చేశారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేసినది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, డాక్టర్ గేదెల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై 6ఎ కేసు నమోదు



పట్టుకున్న సిలిండర్లతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

డెంకాడ: మండలంలోని రెండు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 6ఎ కేసు నమోదు చేశారు. ఈ మేరకు చింతలవలస పరిధి ఉన్న 99 ద రాయల్ బిర్యానీ హౌస్, జొన్నాడ వద్ద ఉన్న ద్వారకా హోటల్‌లో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. ఇంటిలో వినియోగించాల్సిన ఎల్‌పీజీ సిలిండర్లను హోటల్‌లో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో 99 ద బిర్యాని హౌస్‌లో 6 సిలిండర్‌లు, ద్వారకా హోటల్‌లో 5 సిలిండర్లను పట్టుకుని 6ఎ కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. పట్టుకున్న సిలిండర్లను సాయి గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, వీఆర్‌వోలు కన్నయ్య, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

పార్వతీపురంటౌన్: రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ డే సందర్భంగా ప్రతి రెవెన్యూ కార్యాలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన యానాది రవి

డెంకాడ: విజయనగరం–నాతవలస ఆర్అండ్‌బీ రహదారిపై డెంకాడ మండలం పెదతాడివాడ కూడలి సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో చిత్తూరు జిల్లాకు చెందిన యానాది రవి(36) మృతి చెందాడు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యానాది రవి, బావ కంతలచెరువు గోపి ఈ నెల 13వ తేదీన చిత్తూరు జిల్లా నుంచి ఐషర్‌వ్యాన్‌లో టమాటో లోడ్‌తో విజయనగరం వచ్చారు. 15వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో అన్‌లోడ్ చేశారు. అక్కడి నుంచి ఐషర్ వాహనం యజమానికి ఫోన్‌చేయగా పెదతాడివాడ వద్ద ఉన్న న్యూ వెంకట్ మినీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి చిత్తూరు ఏమైనా కిరాయి ఉంటే చేసుకుని రావాలని చెప్పారు. దీనిలో భాగంగా యానాది రవి, బావ కంతలచెరువు గోపి పెదతాడివాడ వచ్చి ఉన్నారు. 18వ తేదీ రాత్రిభోజనం అనంతరం 11:30 గంటల సమయంలో ఫోన్ పట్టుకుని రవి బయటకు వెళ్లగా, గోపి వాహనంలో సేద దీరుతున్నాడు. ఇంతలో పెద్ద శబ్దం వచ్చింది. చీకటిలో వెళ్లి వెతకగా రవి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా వారు వచ్చి రక్తపు మడుగులో ఉన్న యానాది రవిని పరీక్షించారు. అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారని మృతుడి బావ కంతలచెరువు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు. ఐషర్ వాహనంలో గోపి డ్రైవర్‌గా, రవి క్లీనర్‌గా పని చేస్తున్నారు. మృతుడు యానాది రవి చిత్తూరు జిల్లా బైరెడ్డిపాలెం మండలం నెల్లిపట్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹103	₹176	₹186

జోగిందొరవలసకు ఝలక్..!

• తొలుత మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తింపు, తర్వాత రద్దు
• మౌలికవసతులు లేని కారణంగా జాబితా నుంచి తొలగింపు
• నష్టపోతున్న గిరిజన విద్యార్థులు



జోగిందొరవలసలోని ప్రాథమిక పాఠశాల



రామభద్రపురంలోని పూడి వీధి ప్రాథమిక పాఠశాల

ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామభద్రపురం మండలకేంద్రంలోని పూడివీధి ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 54 మంది పిల్లలు చదువుతుండగా ఇద్దరు టీచర్లు మాత్రమే విద్యాబోధన చేస్తున్నారు.ఈ పాఠశాల మోడ్ ప్రైమరీ పాఠశాలకు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయి.ఈ పాఠశాలను కూడా మొదట్లో మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించారు,ఆ తర్వాత పంచాయతీలో ఇప్పటికే మూడు మోడల్ ప్రైమరీ పాఠశాలలను గుర్తించాం. నాలుగోది వద్దు అని రద్దు చేశారు. ప్రభుత్వం నిర్ణయాలతో పిల్లలు నష్టపోతున్నారని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు.

రామభద్రపురం: పేదల చదువు విషయంలో విద్యార్థులతో ప్రభుత్వం ఆటలాడుతోంది. విద్యకు పెద్ద పీట వేస్తున్నాం. విద్యారంగంలో పలు ఉన్నత సంస్కరణలు తీసుకొచ్చి పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యనందిస్తామని చెప్పి పలు పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించి ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి తరగతికొక ఉపాధ్యాయుడిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలోని పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల అని చెప్పి 239 పాఠశాలలను గుర్తించింది. వాటిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా తరగతికి ఒక టీచరు చొప్పున ఏర్పాటు చేసింది. అయితే ఇదంతా బాగానే ఉంది. రామభద్రపురం మండలంలోని గొల్లలపేట పంచాయతీ పరిధి జోగిందొరవలస గిరిజన గ్రామ ప్రాథమిక పాఠశాలలో 44 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడి విద్యార్థుల సంఖ్య సరిపడా ఉన్నారని మొదటి జాబితాలోనే మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించి విద్యాశాఖ అధికారులు ఆ జాబితాను ఎంఈవోలకు పంపించారు.అలాగే పాఠశాలలో మౌలికవసతులు ఎలా ఉన్నాయని, పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంఈవోలకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఎంఈవో పరిశీలించి పిల్లలు సరిపడా ఉన్నా మౌలికవసతులు లేవని నివేదిక పంపించారు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు మోడల్ ప్రైమరీ పాఠశాల గుర్తింపు రద్దు చేశారు. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యకు దూరమవుతున్నామని గగ్గోలు పెడుతున్నారు.

మౌలికవసతుల బాధ్యత ప్రభుత్వానికి లేదా?

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద పాఠశాలలు ఆధునికీకరణ పనులు చేపట్టి కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను తయారు చేసింది. ఈ క్రమంలో నాడు–నేడు పథకం రెండోదశలో జోగిందొరవలస గిరిజన గ్రామంలోని పాఠశాల ఎంపిక చేసి రెండు ఫ్లోర్‌లలో అదనపు గదులతో పాటు మౌలికవసతుల కల్పనకు రూ.35 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో రూ.19 లక్షలతో కిందన ఒక తరగతి గదితో బాత్‌రూంలు, కిచెన్ షెడ్డు నిర్మించారు, ఇంతలో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిధులు విడుదల చేయకుండా నిలిపివేసింది. దీంతో పాఠశాలలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తరగతి గదిలో గోడలకు సున్నం వేయకపోవడంతో పాటు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గచ్చు నేలపై కూర్చుని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. తమ పంచాయతీలోని జోగిందొరవలస పాఠశాలలో మాత్రమే సరిపడా పిల్లలు ఉన్నారని, మౌలికవసతులు లేవన్న సాకుతో మోడల్ ప్రైమరీ పాఠశాలను తొలగిస్తారా? మౌలికవసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ హామీ నీటిమూటేనా?

జోగిందొరవలస ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుని అన్ని మౌలివసతులు కల్పిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హామీ ఇస్తూ ఆ పాఠశాల హెచ్ఎంతో ఫోన్‌లో చెప్పారని తెలిసింది. ఎంపీ హామీతో మా గ్రామ పాఠశాల బాగుపడుతుంది అని అక్కడి ప్రజలు ఆనందపడ్డారు. అయితే ఆ హామీ ఇచ్చి సుమారు 6 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఆ ఊసేలేదు. దాంతో గ్రామస్తుల ఆనందం ఆవిరై..ఎంపీ హామీ నీటిమూటేనా అని మండిపడుతున్నారు.

మరోసారి పరిశీలించాలని ఆదేశిస్తా..



45 మంది రోల్ ఉన్న పాఠశాలలను మాత్రమే మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించాం.జోగిందొర పాఠశాలను మరోసారి పరిశీలించాలని ఎంఈవోను ఆదేశిస్తాను. ఎంఈవో నివేదిక తీసుకుని పరిశీలించి ప్రభుత్వానికి పంపిస్తాను. అవసరమైతే పిల్లలు నష్టపోకుండా మరో టీచర్‌ను నియమిస్తాం.

యు.మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

రాజన్నదొరపై తప్పుడు మాటలు మాట్లాడితే ఖబడ్దార్



మాట్లాడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు

• మక్కువ టీడీపీ మండలాధ్యక్షుడిపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ

సాలూరు: మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు, మంత్రి సంధ్యారాణి సన్నిహిత అనుచరుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, స్థాయిని మరిచి విమర్శలు చేస్తే సహించేది లేదంటూ గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీలు ప్రమీల, రాములమ్మ, సర్పంచ్‌లు ఆదయ్య, సుదర్శనరావు, ఎంపీటీసీ సుబ్బారావు, సీతారాం, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు పరిమళ, ఉదయ్‌కుమార్, కల్యాణ్ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏఎంసీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఉద్దేశించి దగాకోరు అంటూ చేసిన తీవ్ర అభ్యంతరకర పదజాలాన్ని వాడారంటూ అందరూ ముక్త కంఠంతో మండిపడ్డారు. ఓ గిరిజన రైతు కుటుంబం నుంచి నిబద్ధతగల రాజకీయనాయకుడిగా ఉపముఖ్యమంత్రి, మంత్రి స్థాయికి ఎదిగి ఎందరో గిరిజనులకు ఆదర్శంగా రాజన్నదొర నిలిచారన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సాలూరుకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు విరివిగా చేయించి, సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో తన పాలనలో చూపించారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఏనాడూ ఎవరిపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా పార్టీల విధి విధానాలపై రాజకీయ విమర్శలు మాత్రమే చేశారని గుర్తుచేశారు. అటువంటి రాజన్నదొరపై గుల్ల వేణు దగాకోరంటూ మాట్లాడడం దానిని అక్కడే ఉన్న మంత్రి సంధ్యారాణి వారించకపోవడాన్ని గిరిజనసమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

ఆధారాలు చూపించాలి

రాజన్నదొరను దగాకోరు అని వేణుగోపాల్ ఏ ఆధారాలతో మాట్లాడాడో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఆధారాలు చూపించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రి సంధ్యారాణి సమక్షంలో విలేకరిని చంపుతానని హెచ్చరించిన వేణు, మంత్రి అండదండలతో రెచ్చిపోతున్నాడని విమర్శించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

• డీఎంహెచ్ఓ ఎస్.జీవనరాణి

మెంటాడ: గిరిజన ప్రాంత ప్రజలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. ప్రపంచ సికిల్ సెల్ నివారణ దినం సందర్భంగా మెంటాడ మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో లోతుగెడ్డ పంచాయతీ ఉయ్యాడవలసలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సికిల్ సెల్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించి పోస్టర్లు, పుస్తకాలు ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలని అందరూ పరీక్షలు చేసుకోవాలని కోరారు, ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన పిదప ఇచ్చే చికిత్సలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, మెంటాడ పీహెచ్‌సీ వైద్యురాలు జె. లోకప్రియ, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతృప్తికరమైన జీవనశైలికి యోగా దోహదం

• మంత్రి కొండపల్లి శ్రీనివాస్



యోగాసనం వేస్తున్న మంత్రి శ్రీనివాస్ తదితరులు

గంట్యాడ: భారతీయల వారసత్వ సాంస్కృతిక సంపదైన యోగాను యావత్ ప్రపంచం అనుసరిస్తోందని తద్వారా సమగ్రమైన, ప్రశాంతమైన సంతృప్తికరమైన జీవనశైలి వైపు పయనించే అవకాశం ఉందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యోగాను విశ్వవ్యాప్తం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. యోగా ప్రతిరోజూ చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. విద్యార్థులు వారి జీవనంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, పర్యాటక అధికారి కుమారస్వామి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎం.ఆనందరావు, మెప్మా పీడీ చిట్టిరాజు, ఎంపీడీఓ రమణమూర్తి, సీడీపీఓ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

కూటమి కక్షపూరిత చర్యలు



కిందనే కూర్చున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

• సందర్శకులు, కౌన్సిలర్ల కుర్చీలు తొలగించి రాక్షసానందం

బొబ్బిలి: ఇటీవలే కౌన్సిలర్లకు తాయిలాలతో వల వేసి అధికారాన్ని చేజిక్కించుకున్న టీడీపీ నాయకులు వైస్‌చైర్మన్ పదవికి కూడా అవిశ్వాసం పెట్టిన సంగతి తెలిసిందే. అధికారం కోసం అడ్డదారులు వెతుక్కునే టీడీపీ నాయకులకు అధికార దాహం చల్లారడం లేదు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సందర్శకులు, కౌన్సిలర్ల కోసం కుర్చీలు, ఓ టేబుల్ ఉండేవి. అక్కడ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కూర్చుంటున్నారని సంవత్సరాల తరబడి ఉన్న ఫర్నిచర్‌ను గురువారం తొలగించారు. అధికారులు, కౌన్సిలర్ల కోసం, సందర్శకులు, అర్జీదారులు కూడా వచ్చి కాసేపు కూర్చుని తమ పనులు చక్కబెట్టుకుని వెళ్లేవారు. నిన్నమొన్నటి వరకూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే అధిక సంఖ్యలో ఉండడం వల్ల అక్కడ వారు కూడా కూర్చునే వారు. ఆయా వార్డులకు చెందిన ప్రజలు వస్తే వారి యోగక్షేమాలు కనుక్కుని అధికారుల వద్ద ఏమైనా పనులుంటే చేసి పెట్టేవారు. అవిశ్వాసంతో ఈ మధ్యనే అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు అక్కడున్న విజిటర్స్ చాంబర్‌ను పూర్తిగా తొలగించారు. ఒక్క కుర్చీ కూడా లేకుండా చేశారు. గురువారం యాథాలాపంగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అక్కడ కూర్చునేందుకు ఒక్క కుర్చీ కూడా లేకపోవడంతో అవాక్కయ్యారు. ఇదేం ఘోరం అంటూ కమిషనర్ రామలక్ష్మిని కలిసి అడ్గగా ఆమె నీళ్లు నమిలారు. ఏం చేస్తాం చెప్పండి నాకు కొద్ది రోజులుగా వాటిని తొలగించాలని బాగా ప్రెజర్ ఉందని కౌన్సిలర్‌లతో చెప్పారు. దీంతో కౌన్సిలర్లు నేరుగా వచ్చి కిందనే కూర్చున్నారు. కూటమి నాయకుల ఆదేశాలతో ఇలా కుర్చీలు తొలగించడం దారుణమని, ఇదేం చోద్యమని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. కూటమి నాయకుల తీరు పట్ల ఔరా అంటూ నోరెళ్లబెడుతున్నారు.

కాలేజీలో సీట్లు హౌస్‌ఫుల్..!

• ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు పోటెత్తిన అడ్మిషన్లు
• అధ్యాపకుల కృషిఫలితంగా కోలుకున్న కళాశాల



రాజాం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

రాజాం: నిన్నమొన్నటి వరకూ పదుల సంఖ్యలో మాత్రమే ఆ కళాశాలలో విద్యార్థినులు ఉండేవారు. ఒకగానొక దశలో ఆ కళాశాల ఎత్తివేసే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో గత రెండేళ్లుగా అధ్యాపకులు నిరంతర శ్రమతో అక్కడ చదువుతున్న విద్యార్థుల అభ్యసనకు పదునుపెట్టారు. మంచి ఫలితాలు సాధించారు. ఫలితంగా ఒక్కసారిగా ఆ కళాశాలలో అడ్మిషన్లు సంఖ్య పెరగడం ప్రారంభించింది.

కనీవినీ ఎరగని రీతిలో అడ్మిషన్స్

రాజాం పట్టణంలోని సారథిరోడ్డులో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యాయి. జిల్లాలో అత్యధికంగా ఇంటర్ అడ్మిషన్లు పూర్తిచేసుకున్న ఘనత ఈ కళాశాల ఇప్పుడు దక్కించుకుంది. ఈ ఏడాది వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఇక్కడ 92 శాతం ఉత్తీర్ణత లభించడంతో పాటు విద్యార్థినులు అధిక మార్కులు సాధించారు. దీంతో ఈ విద్యాసంవత్సరం ఇక్కడ ఇంటర్ చేరికలు 163కు పెరిగాయి. కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు సంబంధించి ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధనచేస్తున్నారు. మొత్తం 11 మంది అధ్యాపకులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువ చేరికలు కావడంతో అడ్మిషన్లు నిలుపుదల చేశారు.

ప్రిన్సిపాల్ నిర్ణయాలతో..

ఏడాదిన్నర క్రితం ఇక్కడికి జనార్దనరావు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. అంతకుముందు ఆయన సంతకవిటి మండలంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేసేవారు. అక్కడ కూడా ఆయన అనుసరించిన విధానాలు, క్రమశిక్షణ, సమయపాలన, కళాశాల అభివృద్ధి తదితర అంశాల్లో తన పాత్ర చాటుకున్నారు. అక్కడి నుంచి రాజాం ప్రభుత్వ బాలికల కళాశాలకు బదిలీపై వచ్చిన ఆయన ఇక్కడ కూడా విద్యార్థినుల్లో క్రమశిక్షణ అలవాటుచేయడం, నిరంతర శ్రమ, సమయపాలన, విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశాలు, పదోతరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించడంతో ఇక్కడి కళాశాలపై అందరి దృష్టిపడింది. వీటికి తోడు అందరు అధ్యాపకులు పోటాపోటీగా బోధన చేయడంతో విద్యార్థినులు రాణించి, మంచి ఫలితాలు సాధించడం, ఫలితంగా ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి.



ఫస్ట్ ఇయర్ విద్యార్థినిలకు బోధిస్తున్న ప్రిన్సిపాల్ జనార్దన రావు



విద్యార్థినిలతో కళకళలాడుతున్న సెకెండ్ ఇయర్ తరగతిగది

అందరి సహకారంతోనే..



కళాశాలలో మంచి బోధన జరుగుతోంది. అధ్యాపకులు అంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల సహకారం చాలా బాగుంది. అందుకే మంచి ఫలితాలు సాధించగలుగుతున్నాం. ఈఏడాది ఫస్టియర్‌కు 163 అడ్మిషన్లు వచ్చాయి. అడ్మిషన్లు నిలుపుదల చేసేశాం.

డి.జనార్దనరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రాజాం

బోర్డులు మార్చండి ప్లీజ్..!

• అస్తవ్యస్తంగా సూచిక బోర్డులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో విస్తరించిన అంతర్రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు సరైన దిశగా లేకపోవడంతో వాహన చోదకులు అత్యంత వేగంగా ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. హార్న్ కొట్టాల్సిన ప్రాంతంలో సూచిక లేక స్కూల్ జోన్‌ల వద్ద నిర్దిష్ట వేగంతో వెళ్లక, మలుపులను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ప్రజారవాణాకు సంబంధించిన, అలాగే ఇతర రాష్ట్రాలకు రాకపోకలు సాగించే భారీ నుంచి అతిభారీ వాహనాలు వందల సంఖ్యలో ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తాయి. ఇప్పటికే రహదారిపై ఉన్న సూచికలు దిశ మార్చుకుని సక్రమంగా లేకపోవడంతో సరైన దిశలో వాటిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



దిశ మారి సక్రమంగా లేని హార్న్ కొట్టాలని సూచిస్తున్న సూచిక





సక్రమంగా లేని మలుపును సూచించే బోర్డు



వేరే దిశకు తిరిగి ఉన్న స్కూల్ జోన్ బోర్డు